## Key Area 1 : Perspectives on school leadership

# ప్రధాన రంగం : పాఠశాల నాయకత్వం – దృక్పథం

**మాడ్యూల్ పేరు** : పాఠశాలల్లో అభ్యసన వికాసము – ప్రధానోపాధ్యాయుని పాత్ర (Learning in Schools – Role of School Head)

**యూనిట్–1** : మానవ సమాజ జ్ఞాన పురోభివృద్ధికి పాఠశాల పాత్ర

**యూనిట్–2** : జట్టు (Team) నాయకత్వం

**యూనిట్–3** : విద్యార్థుల సమగ్ర వికాసం కొరకు నాయకుడిగా ప్రధానోపాధ్యాయుడు చేయవలసిన పనులు

**రచయిత** : శ్రీ S. రమేశ్ బాబు,
ప్రిన్సిపాల్, DIET, మెదక్.

# పాఠశాలల్లో సమగ్ర వికాసము – ప్రధానోపాధ్యాయుని పాత్ర

## లక్ష్యాలు

ఈ మాడ్యూల్ పూర్తి అయిన తరువాత మీరు...

1) పాఠశాలలో నాయకుడిగా ఏ అంశాలపై నేతృత్వంవహించాలి ఎలా నిర్వహించాలి అనే అంశాలపై అవగాహన చేసుకుంటారు.

2) సమూహం, జట్టు (Team) మధ్య ఉన్న వ్యత్యాసాన్ని అవగాహన చేసుకొని తమ తమ పాఠశాలలో జట్టును ఏర్పాటుచేసుకొని నాయకత్వం వహించగలుగుతారు.

3) పాఠశాల నాయకుడిగా బోధన, బోధనేతర అంశాలపై తనకెదురైన సవాళ్ళను అధిగమించి పాఠశాలను పురోగమన పంథాలో నడిపిస్తారు.

## 1.0 మానవ సమాజ జ్ఞానాభివృద్ధికి పాఠశాల పాత్ర

## పరిచయం

సృష్టిని పరిరక్షిస్తూ ప్రతిసృష్టి చేయగల సమర్థుడు మానవుడే; సృష్టిలో అనేక జీవరాసులున్నాయి. వాటిని రెండు భాగాలుగా విభజించవచ్చు. అవి, మొక్కలు, జంతువులు, జంతువులలో నాడీ వ్యవస్థ ఉండి నియంత్రణలో, సమన్వయంలో తోడ్పడతాయి. జంతు వర్గానికి చెందిన క్షీరదాలలో మెదడు బాగా పరిణితిచెంది ఉండుటవలన అవి బాగా అభ్యసించగలుగుతాయి. ఉన్నత క్షీరదమైన మానవునిలో జీవపరిణామ క్రమంలో మెదడు అత్యున్నత స్థాయిలో అభివృద్ధి చెందింది. కనుక మానవులు సులువుగా అభ్యసించగలుగుతారు మరియు అభ్యసించిన విషయాలను బాగా జ్ఞాపకం ఉంచుకోగలుగుతాడు. మానవుని మేదస్సు కేవలం అభ్యసించడానికే కాకుండా, జ్ఞానార్జనకు, ఆలోచించడానికి, ఊహించడానికి, జ్ఞాపకశక్తికి, వివేచనకు, పునఃస్మరణకు, సృజనాత్మకతకు, తార్కికతకు ఉపయోగపడుతుంది.

## ఎందుకు నేర్చుకోవాలి?

చార్లెస్ డార్విన్ అనే ప్రకృతి శాస్త్రవేత్త ప్రకారం, జీవులలో మనుగడ కొరకు పోరాటం జరుగుతుంది. ఈ పోరాటంలో గెలుపు పొందిన వారు సార్థక జీవులవుతారు (యోగ్యతమముల సార్థక జీవన అనే సూత్రం) అందువలన మానవులు మంచి జీవనం గడపవలెనంటే, బాగా అభ్యసించవలసి వస్తుంది.

## పాఠశాల అవసరమేంటి?

ప్రాచీన కాలంలో మానవుడు ప్రకృతిలో జరుగుతున్న విషయాలను గమనించి, అనుభవపూర్వకంగా నేర్చుకున్నాడు. కార్యాకరణ సంబంధాలను అర్థం చేసుకొని నేర్చుకున్నాడు. బ్రతకడం కోసం ఇతర జంతువులతో పోరాడినాడు. ఆ ప్రయత్నంలో అగ్నిని ఎలా పుట్టించవచ్చో తెలుసుకున్నాడు. చక్రం తయారుచేసిన పిదప టెక్నాలజీ

అభివృద్ధి చెందింది కాలం గడిచిన కొద్దీ, జ్ఞానం పెరిగింది. జ్ఞాన సముపార్జనకై గురుకులాలు వెలిసినాయి. సమర్థవంతమైన గురువు, రాకుమారులకు, ఉన్నత వర్గాలకు చెందిన పిల్లలకు వారి అంతర్గత సామర్థ్యాల ఆధారంగా, వారి ఆసక్తులకు అనుగుణంగా విద్యాబోధన జరుగుతుండేది. బోధన అభ్యసన, కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితమయ్యేది. కాని సర్వమానవ సౌభ్రాతృత్వానికి, కొంత మంది మేదస్సు సరిపోదు. అందువలన, మానవులందరూ, అభ్యసించాలని, వారు కూడా సమాజానికి, సమాజ అభివృద్ధికి దోహదం చేయగలరని భావించడం జరిగింది. అందువలన ప్రభుత్వమే పాఠశాలలను ఏర్పరచి, పిల్లలందరికీ అభ్యసించే వీలు కల్పించింది. దానిలో భాగంగానే, విద్య అందరికీ అందుబాటులోకి వచ్చింది. ప్రతీ గ్రామంలో, విద్యార్జన వయస్సు కలిగిన ప్రతీ ఒక్కరికీ విద్యను అందించే ప్రయత్నం చేస్తుంది. విద్యాలయాలలో క్రమంగా మార్పు వస్తున్నాయి. నూతన పోకడలను ఉపయోగించి, ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న జ్ఞానాన్ని అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అత్యధిక తెలివితేటలున్న వ్యక్తి ఉన్నత స్థాయిలో జీవిస్తాడని, అన్నింటినీ శాసిస్తాడని చెప్పడానికి అనేక ఉదాహరణలున్నాయి కనుక జ్ఞానార్జనకు ఎవరూ అతీతులు కారు. అందుకే పాఠశాల ఉనికి సృష్టి ఉన్నంత కాలం కొనసాగుతుందని చెప్పవచ్చు.

## పాఠశాల ప్రస్తుత పరిస్థితి :

విద్యార్థుల అభ్యసన ఫలితాలు ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. రాష్ట్ర స్థాయిలో జరిపిన పరీక్షలలో గాని NAS, SLAS, అసర్ సర్వేలోని ఫలితాలు గాని, విద్యార్థుల అభ్యసనలో ఆశించిన గుణాత్మక లేదని నిరూపించాయి. ఫలితాలు సాధించని పాఠశాలల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. విద్యను అందుబాటులోనికి తీసుకురావడానికి, గుణాత్మకతను సాధించడానికి రకరకాల ప్రాజెక్ట్‌లు నెలకొలిపి, నిధులను విడుదలచేస్తూ, ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణలు ఇచ్చినప్పటికీ, విద్యార్థులలో గుణాత్మకత పెరగడంలేదనేది వాస్తవ దూరం కాదు. ప్రభుత్వం, తల్లిదండ్రులు ఆశించిన ఫలితాలు రావడంలేదనేది వాస్తవం. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యం లేదనేది కేవలం అపోహ. మరి ఎందుకు విద్యాప్రమాణాలు దిగజారుతున్నాయి?

దీనికి అనేక కారణాలున్నాయి. ఉపాధ్యాయులు కొన్ని కారణాలు తెలిపితే, తల్లిదండ్రులు మరిన్ని కారణాలు తెలుపుతారు. విద్యావేత్తలు, జ్ఞానులు మరికొన్ని కారణాలు చూపుతారు. ప్రైవేట్ పాఠశాలలు బాగా పనిచేస్తున్నాయని భావిస్తున్నా, బట్టీ విధానాన్ని ప్రోత్సహిస్తున్నాయని, ర్యాంకుల సాధన కొరకు విద్యార్థుల బాల్యాన్ని హరిస్తున్నాయనే వాదన కూడా ఉంది. వీటిని పక్కనబెడితే...

## పాఠశాలను ఎవరి కొరకు? ఎవరు ఉద్ధరించాలి?

బోధనాభ్యసనలో కీలకమైన వ్యక్తులు ఇద్దరుంటారు. దీనిలో కూడా చాలా కీలకమైన వ్యక్తి అభ్యాసకుడు. పిల్లల మెదడు ట్యాబ్యులారసా (ఏమీ వ్రాయబడని నల్లబల్ల) అని కొందరు తాత్వికులు భావిస్తే, అంతర్గత శక్తులతో పిల్లలు జన్మిస్తారని మరికొందరు తత్వవేత్తలు భావిస్తారు. పాఠశాలకు రావడానికి ముందే పిల్లలు తమ కుటుంబ సభ్యుల ద్వారా చాలా విషయాలు నేర్చుకుంటారు. ఉదాహరణకు తమ మాతృభాషలో వినడం, మాట్లాడడం, గణితంలో ఎక్కువ, తక్కువ, పెద్దది చిన్నది, చాలా కొంచెం మొదలైనవి. కుటుంబ నేపథ్యంలో నేర్చుకున్న విషయాలు అనియత విధానంలో ఉంటాయి. నేర్చుకోవాల్సిన జ్ఞానం చాలా ఉంటుంది. నియత విధానంలో బోధిస్తేకాని విద్యార్థులకు అందవలసిన జ్ఞానం అందదు కనుక పాఠశాల అనేది అందరికీ అవసరం.

పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శిక్షణ పొంది ఉంటారు. విషయ పరిజ్ఞానంతో పాటుగా బోధనా పరిజ్ఞానం కూడా ఉంటుంది. అంతే కాకుండా విద్యార్థుల మనస్థత్వం కూడా తెలిసి ఉంటుంది కనుక ఒక సమర్థవంతమైన ఉపాధ్యాయుడు విద్యార్థులకు నేర్పవసిన విషయాలు చక్కగా నేర్పగలడు.

## ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులు ఏం చేయాలి?

ఉపాధ్యాయులు తమ కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించాలంటే కొన్ని నియమాలు పాటించాలి. బడి వేళకంటే ముందే పాఠశాలకు ప్రతీరోజు వెళ్ళాలి. బడి వదిలిన తర్వాత పిల్లలందరూ వెళ్ళిన తర్వాతనే ఉపాధ్యాయులు వెళ్ళాలి. ఒక్కొక్క తరగతికి ఒక్కొక్క ఉపాధ్యాయున్ని బాధ్యునిగా చేయాలి. ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు ఎక్కువ తరగతుల బాధ్యతనివ్వవచ్చు. పిల్లల విషయంలో అందరూ బాధ్యులనే విషయం మర్చిపోవద్దు. ఉపాధ్యాయులందరికీ ప్రధానోపాధ్యాయుడు మార్గదర్శిగా ఉండాలి. అందరికంటే ముందు తానుండి నాయకత్వం ప్రదర్శించాలి.

అభ్యసనం అనేది పిల్లలు పాఠశాలలో అడుగు పెట్టినప్పటి నుండే మొదలౌతుంది. ఉదయం అసెంబ్లీలో జరిగే కార్యక్రమాలలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులందరూ విధిగా పాల్గొనాలి. పిల్లలందరినీ పాల్గొనేటట్లు ప్రోత్సహించాలి ప్రార్థనా గీతం, ప్రతిజ్ఞ, జాతీయ గీతం చక్కగా ఆలపించాలి. పిల్లలచే అభ్యాసం చేయించాలి. ఈ క్రమంలో ఆడియో మేకర్‌ను ఉపయోగించి దానితోపాటుగా రాగయుక్తంగా పాడే విధంగా ప్రోత్సహించాలి. అలవాటు అయ్యేవరకు ఆడియోమేకర్‌ను ఉపయోగించి తరవాత స్వతంత్రంగా ఆలపించే విధంగా ప్రయత్నించాలి. వీలైతే ప్రతీ రోజు పాఠశాల వదలడానికి 10 నిమిషాల ముందు అభ్యాసం చేయించాలి. ప్రధానోపాధ్యాయుడు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలి. ప్రతీ రోజు క్రమం తప్పకుండా అభ్యాసం చేయిస్తే పిల్లలలో క్రమశిక్షణ అలవడుతుంది. పిల్లలు చక్కగా స్నానం చేసి తయారైరావడాన్ని ప్రోత్సహించాలి. అసెంబ్లీలో ప్రతీ ఒక్కరిపై దృష్టిసారించి పరిశుభ్రంగా వచ్చిన వారిని మెచ్చుకోవడం, ఎవరైతే అపరిశుభ్రంగా వస్తున్నారో గమనించి తగు సూచనలు సహాలు ఇవ్వాలి. దీని కోసం ఆసక్తి కనబర్చే ఉపాధ్యాయున్ని ఇంచార్జ్‌గా ఉంచవచ్చు.

## సంస్థ మూల స్తంభం ఎవరు?

వాస్తవానికి పాఠశాల అభివృద్ధి అనేది ప్రధానోపాధ్యాయుని మూర్తిమత్వంపై ఆధారపడుతుంది. పాఠశాల ఉన్నతి కోసం ప్రధానోపాధ్యాయుడు ఒక నాయకుడుగా వ్యవహరించాలి. ఆదిపత్యం చూపించడం కాదు. కలిసి పనిచేయాలి. ఇతర ఉపాధ్యాయులను అనుక్షణం ఉత్తేజపరచాలి. టీంలీడర్‌గా ఉండి పాఠశాల గెలుపు కోసం కృషిచేయాలి.

**కృత్యం :**

ప్రధానోపాధ్యాయుని విధులు బాధ్యతలు తెలపండి?

పాఠశాల అసెంబ్లీని ఇంకా చక్కగా నిర్వహించుటకై తగిన సూచనలివ్వండి?

## 2.0 సమూహంలో (Group) భాగంగా ఉండాలా? జట్టులో (Team) భాగంగా ఉండాలా?

గ్రూప్‌కు మరియు టీంకు చాలా తేడా ఉంది. గ్రూప్‌లో పనిచేసే వ్యక్తులకు పూర్తి బాధ్యతలు ఉండవు. గ్రూప్‌లో పనివిభజన జరుగుతుంది వ్యక్తులు తమకు అప్పగించిన పనిని మాత్రమే పూర్తిచేయడానికి సుముఖతచూపుతారు. తమకు అప్పగించిన పనిపై నిమగ్నమై ఉండుటవలన ఇతరులకు అప్పగించిన పనిపై ఎక్కువగా ధ్యాస ఉంచరు. ఈ సందర్భంగా ఒక సంఘటన గుర్తుకు తెచ్చుకోవాలి. మొక్కలు రోడ్డుకు ఇరువైపులా నాటే పనిని ఒక కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం అప్పగించింది. అందుకొరకు ఆ కాంట్రాక్టర్ ముగ్గురు పనిమనుషులను నియమించుకొని మొక్కలు నాటే కార్యక్రమాన్ని అప్పగించాడు. ఓ సందర్భంలో ఆ ముగ్గురి మధ్య తగాదారావడం వలన అప్పగించిన పనిని సరిగ్గా చేయలేకపోయారు. కాంట్రాక్టర్ ఒక సూపర్‌వైజర్‌ను పంపి తగువు తీర్చమనికోరాడు. సూపర్‌వైజర్ పనిచేస్తున్న ముగ్గురికి పనిని విభజించి ఎవరి పనిని వారే చేసుకోవాలని, ఇతరుల పనిలో జోక్యం చేసుకోవద్దని చెప్పి వెళ్ళిపోయాడు. ఒకరోజు అదే బాటవెంట వెళ్తున్న వ్యక్తికి వీరు చేసే పని విచిత్రంగా తోచింది. ఒక పని మనిషి గుంతలు తీస్తున్నాడు. మరొక పని మనిషి గుంతలు పూడుస్తున్నాడు. ఇదేం పిచ్చి పని అని ఆ పెద్దమనిషి అడిగినప్పుడు వారు చెప్పిన సమాధానం విని ఆశ్చర్యపోయాడు. ఇంతకూ వారు చెప్పిందేందంటే, సూపర్‌వైజర్ మా ముగ్గురికీ వేరే వేరే పనులు అప్పగించాడు. మొదటివాడు గుంతలు తీయాలి. రెండవ వాడు మొక్కలు నాటాలి. మూడవ వాడు గుంతలు పూడ్చాలి. అయితే ఆ రోజు రెండవ పనిమనిషి ఇతర కారణాలవలన పనిలోకి రాలేదు. ఇతరుల పనిలో జోక్యం చేసుకోవద్దని సూపర్‌వైజర్ చెప్పినాడు. అందువల్ల మాకు అప్పగించిన పనిని మేం చేస్తున్నాం అన్నారు. గ్రూప్ పని ఇలా ఉంటుంది కాని టీం అలా కాదు. టీంలో పనిచేసే ప్రతీ ఒక్కరికీ పనితోపాటుగా బాధ్యత అప్పగించబడుతుంది. పనివిభజన అర్థవంతంగా ఉంటుంది. ప్రతీ ఒక్కరు తమ పనిని బాధ్యతాయుతంగా స్వీకరించడం వలన విజయం చేకూరుతుంది. క్రికెట్ టీంలో మొదటి బ్యాట్స్‌మన్ అవుట్ అయితే రెండవ బ్యాట్స్‌మన్ విజయాన్ని తన భుజానికెత్తుకుంటాడు. చివరికి బౌలర్ కూడా బ్యాటింగ్ చేసి టీంను గెలిపించే ప్రయత్నం చేస్తాడు అందరి గమ్యం ఒక్కటే – దేశాన్ని గెలిపించడం.

| **కృత్యం :** గ్రూప్‌కు మరియు టీంకు మధ్య మీకు తెలిసిన తేడాలు చెప్పండి. |
|---|

### ప్రతీ ప్రధానోపాధ్యాయుడు ఇస్రో చైర్మన్ లాంటి నాయకత్వ పటిమ చూపాలి :

పాఠశాలలోని ప్రతీ వ్యక్తి ప్రతీ ఉపాధ్యాయుడు టీంలాగా పనిచేసి, పాఠశాలలోని గుణాత్మకతకు నేనే బాధ్యున్ని అని భావించేలా ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులందరినీ ప్రేరేపించాలి. టీంను చక్కగా నడపాలి. పాఠశాలలోని అపజయాలకు తనను బాధ్యునిగా చేసుకుంటూ, విజయాలకు తన సహచరులను బాధ్యులను చేసినట్లయితే ఉపాధ్యాయులు నెమ్మది నెమ్మదిగా ప్రేరేపించబడి తన ఆశయాల సాధనకు కృషిచేస్తారు. మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ అబ్దుల్ కలాం, తన అనుభవాన్ని ఇలా చెప్పారు. తన ఆధ్వర్యంలో ఒక రాకెట్ లాంచింగ్ జరిగే చివరి సమయంలో తన అసిస్టెంట్, లాంచింగ్‌కు సంబంధించి కంప్యూటర్ ఏదో సమస్య ఉన్నట్లు సూచిస్తున్నదని తెలిపితే, ఈ చివరి నిమిషం రాకెట్ లాంచింగ్ ఆపడం సరికాదనీ, కంప్యూటర్ అప్పుడప్పుడూ తప్పులు చూపించవచ్చని సర్దిచెప్పాడు. రాకెట్ లాంచింగ్ జరిగిన కొద్దిసేపటికే అది విఫలమై కూలిపోయింది.

విలేఖరులందరూ, రాకెట్ విఫలమైన విషయమై ఇంటర్వ్యూ చేయడానికి అంతరీక్ష ప్రయోగశాలకు వచ్చినప్పుడు కలాంగారు ఇస్రో చైర్మన్ అయిన సతీష్ దావన్ చేంబర్‌లో విషాదంగా కూర్చున్నారు. అది గమనించిన సతీష్ దావన్, విలేఖరులకు ఇంటర్వ్యూ ఇస్తూ, ప్రయోగం విఫలం కావడానికి అనేక కారణాలుండవచ్చని తెలిపి దానికి తాను బాధ్యత వహిస్తున్నట్లు ప్రకటించాడు. కలాం పేరు బయట పెట్టలేదు.

మళ్ళీ, కలాం ఆధ్వర్యంలో మరొక రాకెట్ లాంచ్ అయ్యి విజయవంతమైంది. అప్పుడు విలేఖరులందరూ ఇంటర్వ్యూ కోసం వచ్చారు. ఈ తడవ చైర్మన్ సత్తీష్ దావన్ ఇంటర్వ్యూ చేయడానికి కలాంను పంపి విజయానికి కారణం కలాంగారని తెలియజేసారు. ఇలాంటి నాయకత్వం, తన దగ్గర పనిచేసే వ్యక్తుల ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి మరింత శ్రద్ధతో పనిచేయడానికి పనికివస్తుంది. ప్రధానోపాధ్యాయులందరూ సతీష్ దావన్‌లాగా నాయకత్వ పటిమను చూపితే తన దగ్గర పనిచేసే ప్రతీ ఉపాధ్యాయుడు మరో కలాం కాగడని విశ్వసించవచ్చు. ఎవరూ కావాలని తప్పుచేయరు. అనుకోకుండా జరిగిన తప్పును క్షమించి, వెన్నుతడితే ఉపాధ్యాయులలో పనిచేయాలనే తపన పెరుగుతుంది.

**కృత్యం–1:** మీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఏ ఏ సందర్భాలలో జట్టుగా వ్యవహరించారు? అలా వ్యవహరించడంవల్ల కలిగిన సత్ఫలితాలను పేర్కొనండి.

**కృత్యం–2:** మీ పాఠశాలలో జట్టు పనితీరును అభివృద్ధికి పరుచుటకు మీరు చేపట్టే చర్యలను పేర్కొనండి.

## 3.0 విద్యార్థుల సమగ్ర వికాసం కొరకు చేయవలసిన పనులు

### అపవాదు మనకెందుకు?

పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయులు పాఠాలు చెప్పకుండా సెల్‌ఫోన్‌లో తీరికగా మాట్లాడుకుంటారనే అపవాదు ఉన్నది. కొన్ని సందర్భాలలో అది నిజం కావచ్చు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయుడు అధికారయుతంగా కాకుండా దానివలన కలిగే అనర్థాలను, పర్యవసానాలను తెలిపితే స్వచ్ఛందంగా ఉపాధ్యాయులు ఒప్పుకుంటారు. ఉపాధ్యాయుందరూ తమ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి పాఠశాలలో ఒకచోట భద్రపరచుకుంటారు. కొందరు ఉపాధ్యాయులు విరామ సమయంలో ఆరుబయట పిచ్చాపాటి మాట్లాడుకుంటారు. దీనిని పిల్లలు గ్రామస్తులు చూడకుండా ఉంటారా? వీళ్ళకి పనిలేదు జీతాలు దండగ అనుకునే ప్రమాదం లేదా? అందుకే ఉపాధ్యాయులందరూ విరామ సమయాలలో కొత్త పుస్తకాలు చదవడమో, బోధనోపకరణాల తయారీనీ, ఖాళీగా ఉన్న పిల్లలతోనో ఏదో ఒక కొత్త విషయం నేర్చుకునే విధంగా అది జీవితంలో ఎలా ఉపయోగపడుతుందో తెలియజేయాలి. ఉపాధ్యాయుని పట్ల గ్రామస్తులకు, విద్యార్థులకు గౌరవభావం భక్తిభావం నెలకొనే విధంగా ప్రధానోపాధ్యాయుడు చూడాలి.

### అతి ముఖ్యమైన పని తరగతి గదిలో ఉంటుంది :

ఉపాధ్యాయులకు చెల్లించే జీతభత్యాల సార్థకత తరగతిలో ఉపాధ్యాయుని పనితీరుపై ఆధారపడుతుంది. ఉపాధ్యాయులు తరగతి గదిలోనికి పూర్తిగా సన్నద్ధతతో వెళ్ళే విధంగా సూచనలు ఇవ్వాలి. పాఠ్యాంశానికి

సంబంధించిన పథక రచన, బోధనోపకరణాలు సంసిద్ధం చేసుకొని వెళ్ళేవిధంగా చూడాలి. (మొదటి సంవత్సరం కొంత ఇబ్బంది అయినప్పటికీ, సిలబస్ మారేంత వరకు కొద్ది పాటి మార్పులతో ప్రతీ సంవత్సరం ఇది ఉపయోగపడుతుంది అనే విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియజేయాలి.) తరగతిలో బోధిస్తున్నంతసేపు మరొకవైపు ధ్యాస మరలకుండా నేను ఎంత బోధించాను అనేది కాకుండా విద్యార్థులు ఎంతవరకు నేర్చుకున్నారనే దానికై ప్రాధాన్యత ఇవ్వాలి. తను బోధించిన విషయాలు తరగతిలోని ప్రతీ విద్యార్థికి బోధపడిందా లేదా తెలుసుకొని ఎవరికైతే ఇంకా తన సహాయం అవసరమో, వారికి తన విరామ సమయాన్ని ఉపయోగించి ప్రత్యామ్నాయ బోధన గావించాలి. ప్రతీ విద్యార్థికీ నేర్చుకోగల సామర్థ్యం ఉందని నమ్మాలి. ప్రతీ విద్యార్థికి నేర్చుకునే వేగం వేరుగా ఉంటుందని ఉపాధ్యాయులందరికీ తెలుసు. వీలైనంతలో పిల్లలు సరదాగా నేర్చుకునేటట్లు చూడాలి. పిల్లలతో స్నేహపూర్వకంగా ఉంటూనే క్రమశిక్షణకు భంగం వాటిల్లకుండా చూడాలి. బట్టీ విధానానికి, మార్కులకు ప్రాధాన్యతనివ్వకుండా, నేర్చుకున్న విషయం జీవితంలో ఏ విధంగా ఉపయోగపడుతుందో తెలియపర్చాలి.

ఉపాధ్యాయుడు చక్కటి బోధన చేయడానికి తాను ముందుగానే ప్రిపేర్ అవ్వాల్సి ఉంటుంది. దానికోసం, పథక రచన, పిల్లలకు చక్కగా అవగాహన కావడానికి అవసరమైన సామగ్రిని రూపొందించుకోవడం వంటివి చేయాలి. పాఠశాలలో విరామ సమయంలో గాని, ఇంటివద్దగాని ఈ పనులను చేయవచ్చు. ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించడానికి ముందు శిక్షణ సమయంలో ఏ విధంగానైతే పాఠశాలలో మరియు ఇంటివద్ద పిల్లల గురించి ఆలోచన చేస్తూ పనిచేస్తారో అదేవిధంగా పాఠశాలలో ప్రవేశించిన పిదప కూడా పిల్లల గురించి పిల్లల కొరకు పనిచేయాలి. నేను ఉదయం 9 నుండి సాయంత్రం 4 వరకు పాఠశాలలో ఉంటే సరిపోతుంది అనుకోవద్దు. ప్రభుత్వ ఉద్యోగులందరూ 24 గంటలూ ఉద్యోగం చేస్తున్నామనుకోవాలి. ప్రత్యేకంగా సమాజాన్ని రూపుదిద్దే ఉపాధ్యాయుడు ఇలా భావించాలి. అందుకే ఇంటివద్ద ఉన్నప్పుడు పాఠశాల గురించి ఆలోచించవలసిన అవసరం లేదు అనే భావనకు స్వస్తిచెప్పాలి. వీలైతే పథక రచనలోగాని, సామాగ్రి సిద్ధపరచుకోవడంలోగాని ఉత్సాహం కలిగిన కుటుంబ సభ్యులను, మిత్రులను కూడా పాల్గొనే విధంగా ప్రోత్సహించవచ్చు. గుణాత్మకతను పెంపొందించవచ్చు.

## ఉపాధ్యాయునికి కంప్యూటర్ టెక్నాజీ తెలిసి ఉండాలా?

అని ప్రశ్నిస్తే అవును అనే సమాధానం వస్తుంది. పరిజ్ఞానం లేని వారిని కంప్యూటర్ నిరక్షరాస్యుడుగా పరిగణిస్తున్నారు. కనుక ఉపాధ్యాయులు కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటుగా యం.యస్.ఆఫీస్, ముఖ్యంగా పవర్ పాయింట్ తయారుచేయడం తరగతిలో యల్.సి.డి. ప్రొజెక్టర్‌ను ఉపయోగించి ప్రదర్శించడం, అంతర్జాలం నుండి కావలసిన సమాచారం డౌన్లోడ్ చేసుకోవడం. ఈ మెయిల్‌ను తనకు మరియు పిల్లలకు కూడా సృష్టించుకోవడం, వాటిని ఏవిధంగా ఉపయోగించుకోవాలో నేర్పినట్లయితే భావి జీవితంలో ఉపయోగపడుతుంది. వాట్సప్ ద్వారా విద్యార్థులకు వర్క్‌షీట్లు పంపడం వెబినార్ ద్వారా ఆన్‌లైన్ బోధన అనేది కోవిడ్-19 తర్వాత సర్వసాధారణం అయ్యింది. ఇవి తెలియని వ్యక్తి నిరక్షరాస్యునితో సమానం కనుక ప్రతీ రోజు కొత్త విషయాన్ని ఉపాధ్యాయులు నేర్చుకోవాలి. ఠాగూర్ అన్నట్టు ఒక దీపం నిరంతరం తనకు తాను వెలిగించుకోలేకపోతే మరిన్ని దీపాలను ఎలా వెలిగించలేదో అదే విధంగా ఒక ఉపాధ్యాయుడు తననుతాను ప్రతీరోజు మెరుగుపర్చుకోకపోతే ఆరిన దీపంతో సమానంగా భావించాల్సి వస్తుంది. తరగతి గదిలో టెక్నాలజీని ఉపయోగించి బోధించినట్లయితే పిల్లలు ఇంకా

బాగా ప్రేరేపించబడతారు. ఆకర్షించబడతారు. చక్కగా అవగాహన చేసుకుంటారు. టెక్నాజీలని సమకూర్చడంతోపాటు దానిని ఎలా ఉపయోగించుకోవాలో అవసరమైన శిక్షణను ప్రధానోపాధ్యాయుడు అందించవలసి ఉంటుంది. ఉదాహరణకు, వివిధ రకాల జంతువులు వాటి అలవాట్ల గురించి తెలియజేయానుకున్న ఉపాధ్యాయునికి కంప్యూటర్‌తోపాటుగా అంతర్జాల సదుపాయం మరియు యల్.సి.డి. ప్రొజెక్టర్ / కేయాన్‌ను సమకూర్చినచో ఉపాధ్యాయునికి బోధనలో బాగా తోడ్పడుతుంది. పిల్లలు చాలా కాలం గుర్తుపెట్టుకోవడమేగాక. అభ్యసన అనేది ఒక ఆటపాటగా భావిస్తారు. పుస్తకాలను, చదువు చెప్పే ఉపాధ్యాయులను ఇష్టపడతారు. ఈ రకంగా అభ్యసించిన విద్యార్థులు మన పాఠశాలను వదిలి ప్రైవేట్ పాఠశాలకు వెళ్ళగలరా?

ఉపాధ్యాయులను అనునిత్యం ప్రేరేపిస్తూ, బోధనాభ్యసనానికి అవసరమైన సామాగ్రిని సమకూర్చితే, ఉపాధ్యాయులు కూడా బోధించే సమయంలో ఇతర విషయాలపై దృష్టిపెట్టకుండా కేవలం పిల్లలు మరియు బోధించే విషయం గురించి మాత్రమే ఆలోచించినట్లయితే అభ్యసన ఫలవంతమౌతుంది.

**కృత్యం :** అభ్యసనను ఇంకా మెరుగుపర్చడానికి మీకు కావలసిన సామాగ్రి గురించి తెలపండి.

పుస్తకాలలో ఉన్న విషయాన్ని మాత్రమే బోధిస్తే సరిపోదు. జీవన నైపుణ్యాలు సంపాదించాలంటే, అభ్యసించబడిన విషయం నిత్య జీవితంలో ఎలా ఉపయోగపడుతుందో తెలియజేయాలి. విద్యార్థుల సమగ్రమూర్తిమత్వ వికాసం కొరకు ప్రయత్నించాలి. అందుకోసం పాఠశాలలో తరగతి గది బోధనతోపాటు క్రింద తెలియజేసిన కార్యక్రమాలు నిర్వహించాలి.

## సాంస్కృతిక మరియు క్రీడా కార్యక్రమాలు :

పాఠశాల ఒక ఆహ్లాదకరమైన ప్రదేశంగా ఉండాలి. విజ్ఞానంతో పాటుగా వినోదం కూడా ఉండే విధంగా ప్రధానోపాధ్యాయులు ప్రయత్నించాలి. పిల్లలలో ఉండే ప్రతిభను తెలుసుకోవాంటే, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ అనేది అవసరం. కొంత మంది పిల్లలు చదువు విషయంలో వెనకబడినప్పటికీ, వేరే రంగంలో ప్రావీణ్యత కనబరుచుతారు. తరగతిలో ఉండే ప్రతీ విద్యార్థికి ఒక ప్రత్యేకత ఉంటుందని మనోవిజ్ఞానవేత్త అభిప్రాయం. సృష్టిలో ఉండే ప్రతీ మొక్కకు ఏ విధంగానైతే ప్రత్యేకత ఉంటుందో అదే విధంగా ప్రతీ వ్యక్తికి ఒక ప్రత్యేకత ఉంటుందని నమ్మాలి. భూమిపై పుట్టిన ప్రతీ వ్యక్తి అద్వితీయుడే. ఉదాహరణకు క్రికెట్‌లో టెండూల్కర్, విరాట్ కోహ్లి, చదరంగంలో విశ్వనాథ్ ఆనంద్, కోనేరు హంపి, టెన్నిస్‌లో పి.వి.సింధు, సానియా మిర్జా, పరుగు పందెంలో పి.టి.ఉషా, పాట పాడడంలో మంగ్లీ లాంటి ఎంతో మంది యువ గాయకులు, యువ నటులు, వీరందరూ పాఠశాలలో చదువుతున్నప్పుడు ఏమీ ర్యాంకు తెచ్చుకోలేదు. అందువలన చదువులో వెనకబడినంత మాత్రాన పిల్లలను కించపర్చకుండా వారి ప్రతిభ దేనిలో ఉందో తెలుసుకోవడానికి ప్రతీ వారాంతంలో సాంస్కృతిక కార్యక్రమాలైన పాటలు, డాన్స్‌లు, ఏకపాత్రాభినయాలు, మిమిక్రి, ముఖాభినయాలు మొదలైనవి నిర్వహించేటట్లు ప్రధానోపాధ్యాయుడు చూడాలి. ఆయా రంగాలలో ప్రతిభ కనబర్చిన వారిని అందరి ఎదుట ప్రశంసించాలి. లిటరరీ కార్యక్రమాలైన వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీలు, డ్రాయింగ్ వంటి పోటీలు నిర్వహించేటట్లు చూడాలి. అలాగే

శారీరక వికాసం గురించి ఆటల పోటీలు, క్రీడా పోటీలు నిర్వహించే విధంగా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలి, పాల్గొనేటట్లుగా విద్యార్థులను ఉత్సాహపర్చాలి. పాఠశాల నుండే ప్రతిభ కనబరచిన వారిని వారి ప్రతిభను మెరుగుపరిచే విద్యాసంబంధ సంస్థలలో చేర్పించి జాతీయ స్థాయికి ఎదిగే విధంగా ప్రయత్నించాలి. ఈ విషయాన్ని ఆ గ్రామంలో అందరికీ తెలిసే విధంగా సెలబ్రిటీలతో (Celebrities) పిల్లలను సన్మానింపజేయడం వలన మన పాఠశాల ప్రతిష్ఠను పెంచుకోవడమే కాకుండా ఆ గ్రామంలోని పిల్లలందరినీ మన పాఠశాలలో చేర్చడానికి తల్లిదండ్రులు సుముఖత చూపుతారు.

**కృత్యం :**

మీకు తెలిసిన ఇతర రంగాలలో ప్రతిభ చూపిన విద్యార్థుల గురించి, మీరిచ్చిన ప్రోత్సాహం గురించి వ్రాయండి.

విద్యారంగంలో కాకుండా వేరే రంగాలలో మీ పాఠశాల నుండి ఉన్నత స్థాయికి చేరుకున్న పిల్లల సాఫల్య కథనాన్ని తెలపండి.

## టోకెన్ ఎకానమీ సిస్టం :

పోటీ అనంతరం గెలిచిన విద్యార్థులకు సాధారణంగా బహుమతులు ఇస్తుంటారు. దాని వలన ఎక్కువ పోటీలలో గెలిచిన కొంత మంది విద్యార్థులకు ఒకే రకమైన బహుమతులు రెండు, మూడు ఇస్తుంటారు. దానివలన విద్యార్థులకు పెద్దగా ప్రయోజనం ఉండదు. అందువలన ప్రధానోపాధ్యాయుడు ఈ పద్ధతిని పాటించవచ్చు. ఈ పద్ధతిలో ప్రధానోపాధ్యాయుడు కొన్ని రంగు ప్లాస్టిక్ టోకెన్‌లను పాఠశాల ముద్ర ఉండే విధంగా (హోటల్‌లో ఉపయోగించే విధంగా) తయారుచేయించుకోవాలి. వాటిలో తెలుపు, పసుపు, ఎరుపు, గులాబి, ఆకుపచ్చ రంగులలో తయారుచేసుకొని వాటికి విలువను ఆపాదించాలి. ఉదాహరణకు తెలుపు టోకెన్‌కు 5 రూపాయలు, పసుపు టోకెన్ విలువ 10 రూపాయలు, ఎరుపు టోకెన్ విలువ 15 రూపాయలు, గులాబి టోకెన్ విలువ 20 రూపాయలు, ఆకుపచ్చ టోకెన్ విలువ 25 రూపాయలుగా నిర్ణయించవచ్చు. ఉపన్యాస పోటీలు, వ్యాస రచన పోటీలు ఒకేసారి నిర్వహిస్తున్నారనుకొండి. వాటి కొరకు ప్రథమ బహుమతి విలువ 25గా, ద్వితీయ బహుమతి విలువ 20గా, తృతీయ బహుమతి విలువ 15గా నిర్ణయించినారనుకోండి. ఒక విద్యార్థి ఒక పోటీలో ప్రథమ, రెండవ పోటీలో ద్వితీయ బహుమతి పొందినట్లయితే, అతనికి వరుసగా 25, 20 రూపాయ విలువగల టోకెన్లు బహుమతిగా ఇచ్చి, వాటిని పాఠశాల వార్షికోత్సవం వరకు భద్రపరచుకోమనాలి. వివిధ పోటీలలో గెలుచుకున్న టోకెన్ల విలువ ఆధారంగా వాటిని తిరిగి తీసుకొని అతనికి అవసరమైన వస్తువులను కానుకగా ఇవ్వవచ్చు. అందువలన పిల్లల అవసరాలు తీరుతాయి.

## పాఠశాల గ్రంథాయం :

విద్యార్థులకు వివిధ రకాలుగా విజ్ఞానం అందుతుంది. తరగతి గదిలో ఉపాధ్యాయుని ద్వారా, విద్యార్థులు వారిలో వారు చర్చించుకోవడం ద్వారా మరియు వివిధ రకాల పుస్తకాలు చదవడం వలన జ్ఞానాన్ని పొందుతారు. పొద్దస్తమానం బోధన ద్వారా ఉపాధ్యాయులు మాత్రమే చురుకుగా ఉండి, విద్యార్థులు కేవలం గ్రాహకులుగా

ఉండడంవలన ఎంత మేరకు జ్ఞానం అందాలో అంతమేరకు అందలేకపోవచ్చు. కనుక విద్యార్థులలో పుస్తకపఠన ఆసక్తి నెలకొల్పితే, కేవలం పాఠ్య పుస్తకాలనుండే కాక, అదనపు విజ్ఞానం అందుతుంది. కనుక ప్రధానోపాధ్యాయుడు, పాఠశాల గ్రంథాయాన్ని ఏర్పర్చి, సరిగ్గా నిర్వహించేవిధంగా చూడాలి. దానికొరకు ఆసక్తి కలిగిన ఉపాధ్యాయుణ్ణి గాని, ఆసక్తి కలిగిన విద్యార్థిని గాని ఇంఛార్జిగా నియమించి విద్యార్థులను ప్రోత్సహించాలి. విరామ సమయంలో ఉపాధ్యాయులు కూడా విద్యార్థులు గమనించే విధంగా పుస్తకాలను చదవమని ప్రేరేపించాలి. సహజంగా తల్లిదండ్రులు, పుస్తకాలు, వార్తాపత్రికలు కొనుక్కొని చదివిన పిదప ఇంట్లో ఓ మూలన పారేస్తారు. దాని బదులుగా చదివి వృధాగా ఉన్న పుస్తకాలను పాఠశాల గ్రంథాయానికి బహూకరించే విధంగా విద్యార్థులను మరియు ఉపాధ్యాయులను ప్రోత్సహించాలి. రూం టు రీడ్ (Room to Read) వంటి స్వచ్ఛంద సంస్థలు పాఠశాలలో ఒక గదిని కేటాయించగలిగితే పాఠశాలకు తగినన్ని పుస్తకాలు ఉచితంగా ఇవ్వడమే కాకుండా ఎలా నిర్వహించాలో కూడా శిక్షణ ఇస్తారు. ప్రస్తుతం రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలలో వీరి సేవలు అందిస్తున్నారు.

| **కృత్యం** : మీ పాఠశాలలో పుస్తకాల సేకరణకై మీరు అవలంభిస్తున్న వినూత్న విధానాలను తెలపండి. |
|---|

## త్రాగునీటి వసతి ఏర్పాటు :

కొన్ని పాఠశాలల్లో త్రాగునీటి వసతి ప్రదానోపాధ్యాయుని చొరవతో ఏర్పాటుచేసుకోవడం జరిగింది. ఇది అతి ముఖ్యమైనది. చాలా మంది పిల్లలు ఇంటివద్ద నుండి నీళ్ళ సీసాలు తీసుకొని వస్తుంటారు. ఉపాధ్యాయులు కూడా ఇంటి నుండే త్రాగునీటిని తెచ్చుకుంటున్నారు. పిల్లల ఇంటివద్ద పరిశుభ్రపరిచిన నీరు ఉండకపోతే జలజనిత రోగాలు వస్తాయి. కనుక ప్రధానోపాధ్యాయుడు గ్రామస్తులతో చర్చించి ఆర్.ఓ.ప్లాంట్‌లను గాని, వాటర్ ఫిల్టర్స్‌గాని ఏర్పాటుచేసుకోవాలి.

## మరుగుదొడ్ల ఏర్పాటు / వినియోగం :

చాలా పాఠశాలల్లో మరుగుదొడ్లు ఏర్పాటుచేయబడినాయి. వాటిని సరిగ్గా వినియోగించుకోకపోవడం వలన పాడైపోయి నిరుపయోగంగా మారినాయి. మరుగుదొడ్లు ఉంటే, నీళ్ళ వసతి లేక, నీళ్ళ వసతి ఉంటే, పిలలకు ఉపయోగించుకునే విధానం తెలియక, కొన్ని ప్రాంతాలలో గ్రామస్తులు పాడుచేయడం, వాటికి తాళాలు వేయడం, కేవలం ఉపాధ్యాయులు మాత్రమే వినియోగించుకోవడం వలన పిల్లలు ఇబ్బందులకు గురిఅవుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఉండే పిల్లలకు మరుగుదొడ్డి ఏ విధంగా ఉపయోగించుకోవాలో కూడా పాఠశాల నేర్పాల్సి ఉంటుంది. మరుగుదొడ్డి సౌకర్యంలేని బడికి వచ్చే ఆడపిల్లలైతే మంచినీళ్ళు త్రాగడానికి కూడా జంకుతున్నారు. కొంత మంది ఆడపిల్లలు సమీప ప్రాంతాలలోని స్నేహితురాళ్ళ ఇళ్లల్లోకి వెళ్ళాల్సివస్తుందని తెలియజేసారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, మరుగుదొడ్లకు కావలసినంత బడ్జెట్ కేటాయిస్తుంది. పాఠశాలల్లో మరుగుదొడ్డి సౌకర్యంలేని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంటనే విషయాన్ని జిల్లా విద్యాధికారి దృష్టికి తెచ్చి సమస్యను పరిష్కరించవచ్చు.

అదే విధంగా పాఠశాలలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన సదుపాయం, సకాలంలో పుస్తకాల పంపిణీ, దుస్తుల పంపిణీ చేసినట్లయితే పాఠశాలను వదిలి వెళ్ళడానికి పిల్లలు ఇష్టపడరు. పాఠశాలలో కూరగాయ సాగు, తోటపని, సామాజిక ఉపయోగ సామాగ్రిని పిల్లలతో తయారుచేయిస్తే వారు భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాల కొరకు

ఎదురుచూడకుండా స్వయం ఉపాధి పొందగలరు. ఆకర్షణీయమైన పాఠశాలను రూపొందించడం, అందుకొరకు కేటాయించిన నిధులను సద్వినియోగపర్చడం కొరకు కమిటీని ఏర్పాటుచేసి పాఠశాల రూపురేఖలను మార్చవచ్చును.

**ముగింపు :**

పూర్వము ఒక కంపెనీ క్రమ క్రమంగా క్షీణించిపోయి ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోయింది. అందులో పనిచేసేవారిలో నిర్లిప్తత, బాధ్యతారాహిత్యం వలన దిగుబడి తగ్గి కంపెనీ మూతపడే స్థితికి వచ్చింది. ఆ సమయంలో యాజమాన్యం ఒక మంచి ఉత్సాహవంతుడైన, మేనేజ్‌మెంట్‌లో పట్టాపొందిన వ్యక్తిని మేనేజర్‌గా నియుక్తున్ని చేసింది. అతను తన సిబ్బందితో కలిసి ఉత్సాహంగా పనిచేస్తూ, అందులో పనిచేసేవారిని ఉత్సాహపరుస్తూ, కంపెనీని పరుగు తీయించాడు. అనతి కాలంలోనే అత్యధిక పేరు ప్రఖ్యాతులు గాంచి, విరాజిల్లింది. దీనిని బట్టి మనం ఏం తెలుసుకోవాంటే, ప్రభుత్వ పాఠశాలలు పది కాలాలు చక్కగా విలసిల్లాలంటే, అందులో పనిచేసే ప్రధానోపాధ్యాయుని చురుకుదనంపైన అతని నాయకత్వ లక్షణాలపైన ఆధారపడి ఉంటుందని అనుకోవడంలో సందేహం లేదు.

**మదింపు :**

1. పిల్లలు బడికి రాకముందే అనియత విధానంలో చాలా విషయాలు నేర్చుకుంటారు. (సత్యం / అసత్యం)
2. పాఠశాల అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయుని పాత్ర కంటె మిగతా భాగస్వాముల పాత్ర కీలకం. (సత్యం / అసత్యం)
3. సమూహంలో పనిచేసే వ్యక్తులు ఒకే గమ్యంతో పనిచేస్తారు. (సత్యం / అసత్యం)
4. పాఠశాలలోని విజయాలకు తన సహచరులను బాధ్యులను చేసి, అపజయాలకు తనను బాధ్యునిగా చేసుకొన్నవాడే నిజమైన నాయకుడు. (సత్యం / అసత్యం)
5. విద్యార్థుల వైయక్తిక బేధాల నిమిత్తం లేకుండా, సమానభావనతో విద్యార్థులందరికి ఒకేరకమైన విద్యాకార్యక్రమాలు నిర్వహించే ప్రధానోపాధ్యాయుడే ఉత్తమ పాఠశాల నాయకుడు. (సత్యం / అసత్యం)